తెలుగు భాష-సంస్కృతి అందరికీ చేరాలి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై

కళాకృష్ణకు గౌరవ డాక్టరేట్‌ను అందజేస్తున్న గవర్నర్ తమిళిసై, టి.కిషన్‌రావు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 28 : మాతృభాష మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతుందని, మాతృభాష మన జీవితంతో ముడిపడి ఉన్నదని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ 16వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్, ఉపకులపతి ఆచార్య తంగెడి కిషన్‌రావు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళాకృష్ణకు మొదటి గౌరవ డాక్టరేట్ పట్టాను అందజేశారు. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయ హైదరాబాద్, వరంగల్, శ్రీశైలం, రాజమండ్రి కేంద్రాలకు చెందిన ఎంఫిల్, పీహెచ్‌డీ పరిశోధనలు చేసిన వారికి పట్టాలు, స్వర్ణపథకాలు అందజేశారు. అనంతరం గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ తెలుగు మాట్లాడే ప్రజలు దేశ విదేశాల్లో మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్నారన్నారు. తెలుగు భాష-సంస్కృతి అందరికీ చేరేలా అధ్యాపకులు కృషిచేయాలన్నారు. సామాన్యులు చదివేలా చిన్న చిన్న పుస్తకాలను ముద్రించాలని సూచించారు. ప్రధాని మోదీ చెప్పినట్లుగా ఎన్‌ఈపీ విద్యాలయాలను ప్రారంభించాలన్నారు. తెలుగులో మాట్లాడడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం గవర్నర్ తమిళిసై, ఉపకులపతి కిషన్‌రావు 11 మందికి గౌరవ డాక్టరేట్లు, 78 మందికి ఎంఫిల్, పీహెచ్‌డీ పట్టాలు, పీజీ, యూజీ పూర్తి చేసిన 31మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు.

రేపు కలెక్టరేట్‌లో జాబ్ మేళా

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు మార్చి 1వ తేదీన మేడ్చల్ కలెక్టరేట్‌లో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.వై.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, ఎంబీఏ చదివిన అర్హత, ఆసక్తి గల యువతి, యువకులు http://www.nic.gov.in/ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకొని హాజరు కావాలని, వివరాలకు 73868 09422ను సంప్రదించాలని సూచించారు.

మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం క్యాంపులు

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చి నెలలో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 7, 14, 21, 28వ తేదీలలో సదరం క్యాంపులు ఉంటాయని, మార్చి 1వ తేదీ నుంచి సదరం స్లాట్స్ మీసేవ కేంద్రాలలో నమోదు చేసుకోవాలని సూచించారు. క్యాంపునకు వచ్చే దివ్యాంగులు మీ సేవ ద్వారా బుక్ చేసుకున్న సదరం స్లాట్, ఆధార్‌కార్డు, ఫొటో, మెడికల్ రిపోర్ట్స్‌తో ఉదయం 9 గంటల వరకు హాజరు కావాలని చెప్పారు.

నగరంలో నేడు

- నీలోఫర్ దవాఖానలో ఉదయం 9:30 గంటలకు న్యూ బోర్న్ స్క్రీనింగ్ ప్రోగ్రాం ప్రారంభోత్సవం.
- హయత్‌నగర్ భాగ్యలత కమాన్ పక్కన ఉదయం 11:40 గంటలకు సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం.
- బషీర్‌బాగ్ ఓల్డ్ ప్రెస్ క్లబ్‌లో మధ్యాహ్నం 12:30 గంటలకు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం

గమనిక: నగరంలో జరిగే కార్యక్రమాల వివరాలను ntgcitybureau@gmail.com కు పంపగలరు.

మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీస్ నోడల్ సెంటర్‌గా..
భాస్కర్ మెడికల్ కాలేజీ

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 28 : నేషనల్ మెడికల్ కమిషన్ భాస్కర్ మెడికల్ కాలేజీని మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీస్ నోడల్ సెంటర్‌గా గుర్తించింది. ఈ నోడల్ సెంటర్‌ను నేషనల్ మెడికల్ కమిషన్ యూజీఎంఈబీ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ వి.వణికర్, నేషనల్ మెడికల్ కమిషన్ సభ్యుడు డాక్టర్ విజయేంద్రకుమార్ బుధవారం ప్రారంభించారు. నోడల్ సెంటర్ మెంటార్ డాక్టర్ అవినాశ్ సూపే, జేబీ విద్యా సంస్థల ప్రమోటర్, జోగింపల్లి బీఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యురాలు డాక్టర్ బి.దీపిక, భాస్కర్ మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ పీవీ చలం, నోడల్ సెంటర్ కన్వీనర్ డాక్టర్ బి.శృతి, వివిధ రాష్ట్రాల నుంచి 24 వైద్య కళాశాలల ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

పాన్ ఏసియన్ రుచులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 28 : బంజారా హిల్స్ రోడ్ నం.12లోని ఓహ్రీస్ హోటల్‌లో పాన్ ఏసియన్ రుచులతో సరికొత్త వంటకాలను 'మింగ్స్ అండ్ మీ' పేరుతో అందుబాటులోకి తీసుకువచ్చారు. బుధవారం హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జపాన్, చైనా, మలేషియా, ఇండోనేషియా, కొరియా, బర్మా, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన నోరూరించే వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్‌ను ఓహ్రీస్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అమర్ ఓహ్రీ ప్రారంభించారు.

కైస్తవులకు అండగా నిలుస్తాం

- 2014 నుంచి దేశంలో భయానక పరిస్థితులు
- రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా నరేంద్ర మోదీ పాలన
- దేశంలో అల్లర్లు, ఘర్షణలను ప్రోత్సహిస్తున్నరు
- కైస్తవ సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : క్రైస్తవులకు అండగా నిలుస్తామని, త్వరలో మెదక్ చర్చిని సందర్శిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మెదక్ డయాసిస్ బిషప్ పద్మారావుతోపాటు వివిధ చర్చిలకు చెందిన క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, ఇండిపెండెంట్ చర్చిల ప్రతినిధులు సచివాలయంలో బుధవారం సీఎంను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్చిల ఆస్తులకు రక్షణ కల్పిస్తామని, కొత్త చర్చిల నిర్మాణానికి అనుమతులు సులభతరం చేస్తామని హామీ ఇచ్చారు. క్రైస్తవుల శ్మశాన వాటికలకు అవసరమైన స్థలం కేటాయిస్తామన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఎన్నికలకు ముందు మెదక్ చర్చిని సందర్శించానని, మరోసారి చర్చిని సందర్శిస్తానని తెలిపారు. అందరి సహకారంతో తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పడిందని, తమ ప్రభుత్వంలో మతపరమైన స్వేచ్ఛ ఉంటుందన్నారు. 2014లో కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భయానక పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ద్వితీయ శ్రేణి పౌరులుగా బతికే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో అల్లర్లు, ఘర్షణలు జరిగితే పాలకులు అణిచివేసేవారని, కానీ పాలకులుగా ఉన్నవారే ఘర్షణలకు కారణమవుతున్నారంటూ మణిపూర్, గుజరాత్ ఘటనలను ఉదాహరించారు. ఇది దేశ శ్రేయస్సుకు మంచిది కాదన్నారు. తెలంగాణలో మాదిరిగా కేంద్రంలోనూ లౌకిక ప్రభుత్వం ఏర్పడటానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెవరెండ్ జాన్‌జార్జ్, డాక్టర్ ఏఎంజే కుమార్, శ్యామ్ అబ్రహం, అనిల్ థామస్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీగా రవికుమార్

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 28: రాష్ట్ర హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా టి.రవికుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 44 మంది ఏజీపీ జాబితాలో రవికుమార్‌కు అవకాశం దక్కింది. నల్గొండలో నాగార్జున డిగ్రీ కళాశాల నుంచి పట్టభద్రుడై, 2008లో మహాత్మా గాంధీ లా డిగ్రీ పూర్తి చేశారు. 2011 నుంచి హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఏజీపీగా మూడేళ్ల పాటు కొనసాగనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

పద్మావతికి పురస్కారం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 28 : తిరుమలగిరి పాఠశాలలో హిందీ సహాయకురాలిగా పనిచేస్తున్న వీఎస్‌వీ పద్మావతికి సాహిత్యంలో కబీర్ కోహినూర్ సమ్మాన్ పురస్కారం దక్కింది. భారత్ భూషణ్ నాసక్ దాస్, అభిషేక్ కుమార్ నేతృత్వంలో దేశవ్యాప్తంగా అనేక రంగాలలో సేవలందిస్తున్న 100 మందికి న్యూ ఢిల్లీలోని అంబేద్కర్ అంతర్జాతీయ హాల్‌లో వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక సందేశంతో పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

ఫాటో షూట్‌లో జూపల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): తారామతి బరాదారిలో తెలుగు వారియర్స్ ఫ్రీ ఇవెంట్ కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. తెలుగు వారియర్స్ టీమ్ ప్లేయర్స్ సుధీర్‌బాబు, సుశాంత్, ప్రిన్స్, ఆశ్విన్, ఆదర్శ్ బాలకృష్ణ, సంగీత దర్శకుడు తమన్ తదితరులు పాల్గొన్నారు.

రవాణాశాఖలో హెల్ప్‌డెస్క్‌లను పటిష్టం చేయాలి

రవాణాశాఖ డీటీ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 28 : రవాణాశాఖలో హెల్ప్‌డెస్క్‌లను మరింత పటిష్టం చేసేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీటీసీ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా ఆర్‌టీఏ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారుల పనివిధానంతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహన యజమానులకు నోటీసులు జారీ చేయాలని, వాహనాల తనిఖీ అధికారులు ప్రతి నెల 5వ తేదీలో చెక్ రిపోర్ట్ నివేదికను అందించాలని సూచించారు. ఓవర్‌లోడ్‌లను అరికట్టడానికి ప్రత్యేక తనిఖీలు చేయాల్సిందిగా ఎంవీఐలను ఆదేశించారు. ఆయన వెంట మేడ్చల్ డీటీఓ రఘునందన్ గౌడ్, ఎంవీఐలు ప్రతాప్ రాజా, బాబు, శిల్ప, ఏఎంవీఐ త్రివేణిబాయి, ఏఓలు రామకృష్ణ, ఇష్తేకార్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సుశీలమ్మకు భారత రత్న ఇవ్వాలి : మండలి చైర్మన్ గుత్తా

రవీంద్రభారతి, ఫిబ్రవరి 28 : గానకోకిల సుశీలమ్మ తెలుగు జాతి సంపద అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, కృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో గానకోకిల పి.సుశీలకు మెలోడి క్వీన్ ఆఫ్ ది మ్యూజిక్ అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరై సుశీలమ్మకు అవార్డును బహూకరించి మాట్లాడారు. గానకోకిల సుశీలమ్మ దాదాపు అన్ని భాషల్లో సుమారు 50వేల పాటలు పాడి ప్రజల నోట్లో నాలుకగా మారారని అన్నారు. సుశీలమ్మకు అత్యున్నత అవార్డు భారతరత్న ఇవ్వాలనే డిమాండ్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీల్‌వెల్ సీఎండీ బండారు సుబ్బారావు, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ బొక్క భీంరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరి, పోలీస్ హౌజింగ్ బోర్డు మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు నవరస గాయని ఆమని బృందంచే 'సీల్‌వెల్ సినీ సుస్వరాలు-50 సుశీలమ్మ' సినీ సంగీత విభావరి వీక్షకులను ఎంతగానో అలరించింది.

సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధి కావాలి

ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లింబాద్రి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 28 : తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధి నమూనా కావాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ : ఎమర్జింగ్ ఇష్యూస్, పాలసీ ఇంటర్వెన్షన్స్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాస్పెక్ట్స్' అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన సదస్సు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ లింబాద్రి హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సదస్సు డైరెక్టర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింత గణేశ్, ఐసీఎస్ఎస్ఆర్ - ఎస్ఆర్‌సీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, ఓయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.అర్జున్‌రావు, సోషియాలజీ విభాగం బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ విష్ణుదేవ్, సదస్సు కో డైరెక్టర్ డాక్టర్ రామ్ బీనవేణి షెఫర్డ్, తదితరులున్నారు.

ఐఐసీటీని సందర్శించిన కేరళ విద్యార్థులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ) : స్టడీ టూర్‌లో భాగంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీని పలు కాలేజీ విద్యార్థులు సందర్శించారు. బుధవారం కేరళ నుంచి వచ్చిన 16 మంది విద్యార్థుల బృందం.. ఐఐసీటీ క్యాంపస్ పరిధిలోని ల్యాబోరేటరీలను పరిశీలించారు. అదేవిధంగా వరంగల్‌కు చెందిన 45మంది కాలేజీ విద్యార్థులు ల్యాబోరేటరీని సందర్శించారు. ఈ సందర్భంగా స్టడీ టూర్‌కు హాజరైన విద్యార్థులను ఉద్దేశించి సెమియో- కెమికల్, కెమికల్ ఇంజినీరింగ్, జెనిటిక్ కెమిస్ట్రీ ల్యాబ్‌లతోపాటు, బయో గ్యాస్ ప్లాంట్, మోల్ బ్యాంక్ ల్యాబోరేటరీలను విజిట్ చేశారు. కాగా సందర్శనకు వచ్చిన విద్యార్థులకు ఐఐసీటీ పరిశోధన బృందం ప్రత్యేక కార్యక్రమాలతోపాటు, ల్యాబోరేటరీ ద్వారా అందించే సేవలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఉన్నత విద్యావకాశాలు, ఎమర్జింగ్ టెక్నాలజీతో కెమికల్ రంగంలో వస్తున్న మార్పులపై అవగాహన కల్పిస్తూ ఇంటరాక్షన్ సెషన్ నిర్వహించారు.

ఐఐసీటీలో సైన్స్ డే వేడుకలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ): ఐఐసీటీలో జాతీయ సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ సీఈవో డా.జితేంద్ర శర్మ హాజరై ప్రసంగించారు. గ్రామస్థాయిలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఢిల్లీ కేంద్రంగా వైద్య సేవలు అందించే ఎయిమ్స్ వరకు తాము సేవలు అందిస్తున్నామన్నారు. ఆసియాలోనే తొలి డివైజ్ మాన్యుఫాక్చరింగ్ పార్క్ ఏపీలో నెలకొల్పి వైజ్ఞానిక ఫలాలను అందించడానికి కృషి చేస్తున్నట్లుగా తెలిపారు. నిత్యం అత్యంత చౌకైన ధరల్లో 11లక్షల ఆర్టీపీసీఆర్, 1000 ఆక్సిజన్ వెంటిలేర్లను, 250 వెంటిలేటర్లను తయారు చేసే సామర్థ్యం ఉందన్నారు. దేశం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్లకు పరిష్కారం చూపడంలో శాస్త్రవేత్తలు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అనంతరం నోబెల్ ప్రైజ్ విజేత భారత సైంటిస్ట్ సీవీ రామన్ సైన్స్ రంగానికి చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐఐసీటీ డైరెక్టర్ డా.డి.శ్రీనివాస రెడ్డి, ఐఐసీటీ పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 28 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ తదితర కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 13వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

భాగ్యనగర్ కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్‌కు ఫిర్యాదు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగులకు ఇండ్ల స్థలాల కేటాయింపు విషయంలో భ్యాగనగర్ టీఎన్జీవో మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీలో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని ఆ సొసైటీ సభ్యులు కో-ఆపరేటివ్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సంఘం సభ్యులు పాండురంగారావు, నర్సింగరావు, టి.వెంకటేశ్వరావు సొసైటీలో జరిగిన అక్రమాలపై తయారు చేసిన పత్రాలను హైదరాబాద్ గృహకల్ప కాంప్లెక్స్‌లో డైరెక్టర్‌కు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వి.ధన్‌రాజ్, హేమలత, మహేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీడీఎఫ్‌డీలో జాతీయ సైన్స్ డే వేడుకలు

ప్రసంగిస్తున్న గ్లోబల్ హెల్త్ డైరెక్టర్ డా.గగన్ దీప్ కాంగ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌లో నేషనల్ సైన్స్ డేను నిర్వహించారు. కార్యక్రమానికి సీడీఎఫ్‌డీ డైరెక్టర్ ఉల్లాస్ కొల్తూర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన చర్చగోష్ఠిలో హ్యూమన్ ఎక్స్‌పెరిమెంటల్ మెడిసిన్ అంశంపై గ్లోబల్ హెల్త్ డైరెక్టర్ డా.గగన్ దీప్ కాంగ్ ప్రసంగించారు. నేటితరానికి సైన్స్ ప్రాధాన్యతను వివరించేలా ప్రయోగాత్మక విధివిధానాల అవశ్యకతను ప్రస్తావించారు. సీడీఎఫ్‌డీ, యంగ్ రీసెర్చ్ స్కాలర్లు హాజరయ్యారు.

ఆయుష్‌ను సందర్శించిన కర్నాటక విద్యార్థులు

ఆయుష్ సంస్థను సందర్శించిన పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రథమ సంవత్సరం ఆయుర్వేద కళాశాల విద్యార్థులు

సైదాబాద్, ఫిబ్రవరి 28 : గడ్డి అన్నారంలోని ఆయుర్వేద పరంపర సంస్థను బుధవారం కర్ణాటక హుమ్నాబాద్ రాజరాజేశ్వరి ఆయుర్వేద కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయూష్ సంస్థ ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ జీ.పీ ప్రసాద్ ఆయూష్‌లోని గ్రంథాలయంలోని పురాతన, సంగ్రహాలయంలోని తాళ పత్ర గ్రంథాలు, వైద్య చికిత్స చరిత్ర సంబంధించిన విషయాలు, ఐఎంఆర్ ప్రాజెక్టుల గురించి వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గోపీచంద్, మణిమోనికా, శ్రీదేవి, సంతోష్, క్రిస్ అంటోని, మురళిమనోహర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాటతో మానవత్వాన్ని పరిమళించేలా సేవా కార్యక్రమాలు

కంటి కాటరాక్ట్ ఆపరేషన్ల శిబిరం ముగింపు కార్యక్రమంలో శ్రీనివాస్ గనగోని, సుమ, రాజీవ్ కనకాల తదితరులు

ప్రముఖ యాంకర్ సుమ కనకాల

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 28: మాటతో మానవత్వాన్ని పరిమళించేలా సేవా కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమని ప్రముఖ యాంకర్, ఫెస్టివల్స్ ఫర్ జోయ్ అధ్యక్షురాలు సుమ కనకాల పేర్కొన్నారు. మన అమెరికా తెలుగు అసోసియేషన్ (మాట) ఆవిర్భవించిన 10 నెలల కాలంలో 22 బ్రాంచ్‌లను విస్తరించి 5 వేలమందితో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని మాట అధ్యక్షుడు శ్రీనివాస్ గనగోని పేర్కొన్నారు. బుధవారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో శంకర్ నేత్రాలయ సౌజన్యంతో కలిసి గత పది రోజులుగా నిర్వహించిన ఉచిత కంటి కాటరాక్ట్ ఆనరేషన్ల క్యాంప్ ముగింపు శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2300మందికి కంటి పరీక్షలు చేసి 200మందికి ఆపరేషన్లు నిర్వహించి 100 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయడంతో పాటు మరో 250మందిని చెన్నైకి పంపించి వైద్య సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజీవ్ కనకాల, శంకర్ నేత్రాలయ ప్రతినిధి అరుల్, డాక్టర్ విజయ్ భాస్కర్, ప్రవాసాంధ్రుడు ప్రదీప్, సామల టీవీ ఫెడరేషన్ సభ్యులు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్ స్కూల్‌లో ఆకట్టుకున్న స్పోర్ట్స్‌డే

ఖైరతాబాద్, ఫిబ్రవరి 28 : సోమాజిగూడలోని రాజ్‌భవన్ హైస్కూల్‌లో స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆలీవ్ స్వీట్స్ షాప్ చైర్మన్ దొర రాజు, సినీ నటులు సంపూర్ణేష్ బాబు, అప్సర, సాయికృష్ణ ఈ వేడుకలను ప్రారంభించారు. అనంతరం కుమ్మరి అనురాధ అనే విద్యార్థిని రచించిన కవితా సంపుటిని అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణశ్రీ, రాజ్‌భవన్ స్కూల్ ఉపాధ్యాయులు శరత్, సురేందర్ తదితరులున్నారు.

నేటి నుంచి ప్రత్యంగిరా దేవి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రత్యంగిరా దేవి ఆలయం

ఆర్కేపురం, ఫిబ్రవరి 28: ఆర్కేపురం డివిజన్‌లోని కుర్తాళం పీఠం ఆదిపరాశక్తి శ్రీ ప్రత్యంగిరా దేవి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు తెలుగు రెండు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరవుతారన్నారు.

కార్మిక శాఖలో భారీగా బదిలీలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 28: రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కార్మిక శాఖలో ఒకే ప్రాంతంలో మూడు సంవత్సరాలు పైబడి విధులు నిర్వహిస్తున్న అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో ఏసీఎల్-2గా విధులు నిర్వహిస్తున్న జి.నారాయణస్వామి సూర్యపేటకు, హైదరాబాద్ ఏసీఎల్-2గా ఉన్న జి.బాలనర్సింహ స్వామి ఖమ్మంకు, ఏసీఎల్-3గా ఉన్న ఎ.సత్యనారాయణ రెడ్డి హెడ్డాఫీస్‌కు, ఏసీఎల్-3గా ఉన్న ఎస్.వెంకటరాముడు భద్రాద్రి కొత్తగుడెంకు బదిలీ చేశారు. అదేవిధంగా వరంగల్ ఏసీఎల్ కోలా ప్రసాద్‌ను కరీంనగర్‌కు, కరీంనగర్ ఏసీఎల్ ఎం.కోటేశ్వర్లును కామారెడ్డికి, జగిత్యాల ఏసీఎల్ ఎ.రాజేశ్వరమ్మను వరంగల్‌కు, అదిలాబాద్ ఏసీఎల్ జి.శ్రావణిని నిజామాబాద్‌కు, మేడ్చల్ -మల్కాజిగిరి ఏసీఎల్ పి.ప్రభావతిని మహబూబ్‌నగర్‌కు, మహబూబ్‌నగర్ ఏసీఎల్ ఎం.యాదయ్యను మేడ్చల్-మల్కాజిగిరి, ప్రస్తుతం సంగారెడ్డి ఏసీఎల్‌గా ఉన్న జాన్సన్‌ను జగిత్యాలకు, నిజామాబాద్ ఏసీఎల్ ముత్యంరెడ్డిని హైదరాబాద్ -3 ఏసీఎల్‌గా, కామారెడ్డి ఏసీఎల్ ఎం.సురేందర్ కుమార్‌ను అది